జీవితవిమర్శ

# "ఏది చీకటి, ఏది వెలుతురు?"

ఈశ్వర్

పగల్లా నాలుగు గోడలమధ్య పనిచేసిన విసుగుచే మసకచీకటి సమయానికి మబ్బులావరిస్తున్న ఆకాశంక్రింద ఆడాబాల్లో కూర్చుని వాతావరణ పరిస్థితులు చర్చిస్తున్నాం నేనూ చందూ కలిసి. చందూకి, అసలు, దీపావళి ప్లాను యీ మబ్బులు ఎక్కడ తల్లక్రిందులు చేస్తాయో అని భయం. ఒక వారంనుండి రాత్రీ పగలూ అవస్థపడి, యూనివర్సిటీ పరీక్షలకి కూడా పడని తాపత్రయంతో కట్టిన బాణసంచా అంతా దీపావళి నాటిరాత్రి జరుగబోయే పోటీల్లో ప్రయోగించే సావకాశం యిస్తాయో యివ్వవోనని తెగతిట్టి పోస్తున్నాడు మబ్బుల్ని—నాకు దీపావళిమీద మోజుతక్కువ—

'ఏంవుందిరా సరదా పడడానికి- పరిస్థితులు ఏమీ బాగులేవు- ఎటుచూసినా. యింట్లోగాని, వాకిట్లోగాని,దేశంలోగానిసంతృప్తిపడడానికి కావలసిన దొక్కటీలేదు. ఏదో కృత్రిమంగా డాం-డూం- అనిపిస్తే ఉత్సాహంవస్తుందా ఏమిటి?' అంటాను నేను.

'పోరా, నువ్వో సన్యాసిగాడివి పోగయ్యావు. ఏ హిమాలయాలకో పో—నువ్వూ నేనూ కూడా సుఖపడతాం. దేశంలో ఎవో, ఎక్కడో చిక్కులున్నాయని ప్రాణాలు బిగబట్టుకుని కూర్చోమంటావా? అసలు రాజకీయాలకీ మనకీ యింత ముడి ఎందుకురా? నాయకులేదో కిందా మీదా పడుతున్నారుకదా; వేదాంతం ప్రతి విషయంలోకీ తీసుకురాకు—కొసకి నువ్వో పచ్చి సినిక్కువై పోతావేమోనని నాభయం' అన్నాడు విసురుగా.

వీడేమో విడిపించుకునే స్థితిలోలేడు. అదీగాక యిప్పుడు వీడితో వాదనకి నాకు ఓపికకూడా లేదు. అందుచే ఆ విషయం వదిలిపెడుతూ 'యిప్పుడు బలవంతం ఏమీలేదుగాని' అని నేననబోతూండే సరికి 'ఢాం' అని పెద్దశబ్దమయింది. ఇద్దరం తుళ్లిపడ్డాం.

'ఆటంబాంబురోయ్! మన యింటెదురు మేడగల కంట్రాక్టరుగారు ఆటంబాంబులు కొన్నారు. వారంరోజుల్నుంచి జువ్వలు తెగకాలుస్తున్నారు. ఎన్నికట్టాడో ఏమిటో!' అన్నాడు చందూ.

'అవును-ఆయన కాకపోతే యింకెవరు కాలుస్తారు? చీకటి బజారులో గడించిన పాపపుచీకటిని యీ వెలుతుర్ల మధ్య కనపడకుండా చేదామని ప్రయత్నం కాబోలు. ఇన్నాళ్లూ సారా కొట్ల మీద దిట్టంగా గడించాడు. మద్యపాన నిషేధం కదా-ఇకముం దేమిచేస్తాడో పాపం' అన్నాను.

'వార్ టైమ్‌లో కంట్రాక్టరుగా స్థానం సంపాదించాడు గదా. ఈ వుద్యోగం తామరసంవంటిది. 99 రకాలుగా ధనార్జనకి అవకాశం వుంటుంది. పోనీగాని-చెప్పు! ఈ రోజుల్లో న్యాయానికి దారి వుందా? చేవవున్నవాడు స్వశక్తివల్ల పైకి రాగలుగుతున్నాడా? పై అంతస్తులో మనవాడెవడేనా వుంటే జుట్టుపట్టుకుని పైకి లాగుతాడు. ఏదో అవస్థపడి గడించాడు-గడించకపోతే యీ ప్రపంచంలో యిప్పుడు బతకలేం. అటువంటి వాళ్లే ప్రయోజకులని గౌరవం. మన మొహాలు ఎవడేనా చూస్తాడా చెప్పు' అన్నాడు పిడివాదంలోకి దిగి చందూ.

'అవునురా అబ్బాయీ, అవును. నువ్వో మాడు ఎక్కడేనా తలపాగా వెయ్యడానికి' అని నేనంటూండేసరికి 'టంగు', 'టంగు శబ్దాలు వినబడ్డాయి. 'ఫైర్ యింజన్లు' అన్నాడు చందూ రోడ్డుమీదకి తొంగిచూస్తూ.

'దీపావళి వచ్చేసరికి బీదవాళ్ళ గుండెలు బిక్కుబిక్కుమంటాయి. పాకల్లో వుండేవాళ్లు యీ నాలుగురోజులూ నిద్రపోరు. ఈ వూరికి దాపరించిన నీటికరువు మరీబాధ- కలవాళ్ళ పిల్లలు రకరకాల టపాకాయలు కాలుస్తూంటే—పాపం— బీదవాళ్ళపిల్లలు గుడ్లప్పచెప్పి చూస్తూంటారు—కాలుతూండే పొక్కులతో నువ్వు ఎన్నిచెప్పు—

యిలాంటిరోజుల్లో యీ పండుగలు మహాగొప్పగా చెయ్యడానికి ఏమీ అర్థంలేదురా' అన్నా కొంచెం పట్టుదలగా.

చందూ కొంచెం తగ్గాడు. మాటల్లోంచి మనస్సును మళ్ళీ మబ్బుల్లోకి మరల్చాడు. వాడికి రాజకీయవాదాలంటే అంతయిష్టంలేదు. వాడి వుద్దేశంలో కొంచెం సీరియస్‌గా వాదించే విషయం అంతా రాజకీయమే. రాజకీయాలు రాజ్యం ఏలే వాళ్ళకి వదలిపెట్టి మనగొడవేదో మనం చూసుకుందామంటాడు. మనకీ రాజకీయాలకీ సంబంధం మనకి నచ్చినవాళ్ళకి ఓటు వెయ్యడం వరకేనంటాడు. నచ్చడానికి వాడి కొలతలు చాలా సూటి అయినవి. మంచివేషభాషలు, మింగేస్తాన్, తెల్లారేసరికి అంతా తల్లకిందులు చేసేస్తాన్ అనే దబాయింపుగల నాలిక, మంచి ఓపిగ్గా విరామంలేని పర్యటనం చేసేకాలు-యివి వుంటే చాలు. ఇంతకుమించిన లోతుకిపోవడం వాడికి యిష్టంలేదు. ఈబాపతు నాయకుడు మా వాడిదగ్గిర ఓటు సంపాదించి తీరుతాడు. ఇంత క్లుప్తంగాచెప్తే 'కాదని' బుకాయిస్తాడు గాని, తాత్పర్యంమాత్రం దాంట్లోకే దిగుతుంది. మనం గనక పట్టుదలగా వాదిస్తే-'పోనీ-అంతేననుకో-ఎవడిక్కావాలి యీగోల' అనేస్తాడు. ఎన్యూమరేటర్ యింటికి వచ్చినప్పుడు తనవోటు ఎక్కించుకోలేదు-మనవాడు ఎక్కడికో షికారు పోయాడని, మునిసిపల్ ఆఫీసుకి వెళ్ళి రిజిష్టరు చేయించుకోరా అంటే-'అబ్బా! పోనీరా' అంటాడు. ఇదీ వీడికి 'దేశంగొడవ' అంటే వున్న శ్రద్ధ.

'మబ్బులు ముదురుతున్నాయ్-ఏదో కొంప మునిగినట్లు'-చందూ కొంచెం నిరాశగా అంటూంటగా కారియర్ పట్టుకుని కుర్రాడు వచ్చాడు

'టపాకాయలు కొనుక్కుంటా - ఏమైనా-' అంటూ నసుగుతూ నించున్నాడు కుర్రాడు.

'అదా సంగతి-ఇవాళ వేగం వచ్చావు-'అంటూ చందూ వాడికో పావలా యిచ్చాడు. నాపాతు యిచ్చాను. ఒక్కగంతులో పారిపోయాడు. అల్పసంతోషి. ఒక్కక్షణం ఎవరం మాట్లాడలేదు. నేను నాలుగుపక్కలా చూస్తున్నాను— జువ్వల చురచుర ఎంతజోరుగా వుందోనని. మా యింటిపక్క గదితలుపులవద్ద ఆ కలెక్టరాఫీసు గుమాస్తా చిన్నకొడుకును ఎత్తుకు ముద్దులాడుతున్నాడు. చిరిగి జేబులోంచి పిల్లవాడికి తెచ్చిన టపాకాయలు తొంగిచూస్తున్నాయి. అవన్నీ ఒక జేబులో సరిపోయాయి. పగలల్లా పడిన కష్టంతో తొంగిచూస్తున్న చిందరవందర జుట్టును కొడుకునెత్తుకున్న చేతి ఆనందంతో వెనక్కి నెట్టుకుంటూ— 'నాన్నా- తపాకాయలు యివిగో' అని కొడుకుతో ముద్దుమాటలాడుతూంటే నాకు అదోలా అనిపించింది. భార్య వెనకనుండి 'ఎంతకి కొన్నారు' అంది. 'రెండురోజుల తిండిఖర్చుకి సమానం' అన్నాడు ఆగుమాస్తా- లోతుగా వున్న కళ్లు ఎర్రబడ్డాయి. ఎర్రబడ్డంవల్ల కాబోలు ముందుకు వుబుకుతున్నట్లు కనబడ్డాయి- కంట్రాక్టగారియింటి ముందు లైనుగా కాలుతున్న డజను చిచ్చుబుడ్ల కాంతిలో. మనస్సు వికలమైనట్లుంది- ఆ ఆలోచనకి లేచి లోనికెళ్లాడు.

'పిల్లవాడి సరదాకోసం- అంతా కాలుస్తూంటే ఏడుస్తాడని- అంతేగాని మనకి పండుగేమిటి? రోజు గడవడం దుర్లభంగావుంటే' అని గొణుక్కుంటూ అతనిభార్య వంటింట్లోకి పోయింది.

నేనీ దృశ్యం చూస్తూంటే, మావాడు చెయ్యబోయే టపాకాయల యుద్ధానికి వ్యూహాలు పన్నుతున్నాడు మనోమేఘాలమధ్య. ఆకాశంలోకి జువ్వలు చురచురాపోయి చప్పున ఆరిపోతున్నాయి. ఆసందుమూల బీదపిల్లాడు ఒకమతాబా వెలిగించి కాలుస్తున్నాడు. పాక అరుగుమీద కూర్చుని తండ్రి, తల్లి, చంటిచెల్లి చూస్తున్నారు ఆ ముచ్చట. వాళ్ళకి ఒక్కమతాబా వుంది మరి. అదేనా ఎలాగో పండుగకి యజమాని యిచ్చిన డబ్బుల్లోంచి పెట్టి కుర్రాడికని కొన్నారు.అంతా కూర్చుని మధ్యన వెలిగించారు. మతాబా అంటుకుని కాలుతోంది. పువ్వులు పడ్డంకన్న రేట్టలు వెయ్యడమే ఎక్కువగా వుంది. మూడవవంతు కాలి టప్పుమని ఆరిపోయింది. భోళభోళామని అందులోంచి యిసుక పడింది.

'ఛీ-కుసింత సేపేనా కాల్లేదు.మాయమతాబా' అని ఆ కాగితపుగొట్టం అవతల గిరవాటేశాడు. తండ్రి తనభార్య ముఖంలోకి చూశాడు జాలిగా.

'మాయనాయాల చేత మాఁకట్టోళ్ళ ఈతుసిం తలోనూ బిడ్డోళ్ళ నెత్తిగొట్టి దోసుకోవాలీ' అంది ముఖం వెలవెలబోయిన యిల్లాలు.

'భోజనం చేద్దాంలే, యింక' అన్నాడు చంమా ఆకస్మాత్తుగా. వాడు ఎలాగ అన్నా, నా మనస్సు యీ పండగసంరంభానికి దూరప్రదేశాల్లో సంచరిస్తోంది గనక ఆకస్మాత్తుగా అన్నట్టే వినపడి తుళ్లిపడి లేచాను.

విశ్రాంతికని డాబాలో చేరితే మరింత ఆంగోళన. మావాడికి యీ బాధలేం లేవుకదా. వాడి గోల వాడిదే. అలావుంటే నేగాని యీ ప్రపంచంలో బతకలేమని వాడి సిద్ధాంతీకరణ- పైగా, 'కులాసా కబుర్లు తర్వాత చూసుకుందాం—ముందు ఖానాకి రా' అన్నాడు కుర్చీమీదనుంచి లేస్తూ.

ఇవి నిజంగా కులాసాకబుర్లా లేక జీవిత సమస్యలా తేల్చుమంటోంది కంట్రాక్టరుగారి యింటిముందు పేలిన 'అటంబాంబు'.


గెలుపు సులభము !

# గెలవండి రూ 30,000 లు

పోటీ నెం. P.

మొదటి బహుమతి: ఆల్ కరెక్టు సమాధానములకు రూ 20,000/-
రెండవ బహుమతి: మొదటి 3 నెంబర్లు కరెక్టు రూ 8,000/-
ఎక్కువ ఎంట్రీలు పంపినవారికి రూ 2,000/-

ముగింపు తేది 2-4-49 ఫలితములు 1[illegible]-4-49

ప్రవేశరుసుము: ఒక ఎంట్రీకి 8 అణాలు, మూడు ఎంట్రీలు రు 1.

30

ఇచ్చట 5 గళ్లు గలవు. 4 నుండి 8 వరకు మొత్తం 30 వచ్చునట్లు అంకెలను పేర్చుడు.

కరెక్టుసొల్యూషన్ పుదుక్కోట యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేయబడినది.

పోటీ రూల్సుప్రకారము తెల్లకాగితముపై వ్రాసి ఎన్ని కూపన్లు అయినను ప్రవేశరుసుముతో సహా పంపవచ్చును. ప్రవేశరుసుము మనియార్డరుద్వారా కాని, పోస్టల్ ఆర్డరుద్వారా కాని పంపవలెను. మనియార్డరుద్వారా పంపిన, సదరు మనియార్డరు రసీదు కూపన్లతో జతపర్చి పంపవలెను. సదరు రసీదు లేకుండా పంపబడిన కూపన్లు అంగీకరింపబడవు. బహుమతులు యిచ్చు విషయములో రూల్సుప్రకారము మేనేజరు తీర్పు ఖాయమైనది; బద్ధమైనది. పోటీకి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరము లేవీ నడుపబడవు. వసూలయిన మొత్తమునుబట్టి బహుమతులు పంచబడును. బహుమతులలిస్టు, సరిఅయిన సమాధానం తెలుసుకొనగోరెడివారు కూపన్లతో సహా $1\frac{1}{2}$ అణాల స్టాంపు జతచేసి పంపవలెను. కూపను, ఎడ్రెసు, ఇంగ్లీషులో మాత్రమే వ్రాయండి.

## SAIBABA CONCERNS (S. T.)

SANTHANAPURAM PUDUKKOTTAI, S. I.